## వరి పంటల పరిశీలన



వరి పంటలను పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్ రూరల్, సెప్టెంబర్ 24: బోధన్, సాలూర మండలాల్లోని పలు గ్రామాల్లో వరి పంటలను మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, చెరుకు, వరి పరిశోధన శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన పంటలను పరిశీలించారు. వరిలో బ్యాక్టీరియా ఎక్కువ, ఆకు ఎండు తెగులు ఎక్కువగా ఉండటంతో శాస్త్రవేత్తలతో కలిసి పంటలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్, బోధన్, సాలూరా తహసీల్దార్లు విఠల్, శశిభూషణ్, నాయకులు ఉన్నారు.

## సత్వర చర్యలతో తెగుళ్ల నివారణ

ధర్పల్లి, సెప్టెంబర్ 24 : వరి పంటను ఆశిస్తున్న దోమపోటు బ్యాక్టీరియాలో ఎండు ఆకు తెగులు, కంకినల్లి పట్టడాన్ని వెంటనే గుర్తించి సత్వర చర్యలు చేపడితే తెగుళ్ల నివారణ సాధ్యమని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్ సూచించారు. మండలంలోని ప్రాజెక్టు రామడుగు గ్రామంలో మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు దోమపోటు తెగుళ్ల నివారణ, కంకినల్లి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏవైనా సందేహాలుంటే ఏఈవోలు లేదా తనను సంప్రదించాలని సూచించారు.

## 'బీఈడీలో నూతన సిలబస్‌పై నేడు అవగాహన సదస్సు'

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 24: తెలంగాణ యూనివర్సిటీలో బీఈడీలో నూతన సిలబస్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి తన కార్యాలయంలో బ్రోచర్లను విడుదల చేశారు. అన్ని అనుబంధ బీఈడీ కళాశాలలో అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్స్ విధిగా హాజరుకావాలని కోరారు. ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య అరుణ, ఆడిట్‌సెల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అతీక్ సుల్తాన్ గోరి, యూనివర్సిటీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిలు, పీఆర్వో డాక్టర్ పున్నయ్య పాల్గొన్నారు.

## రేపు ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 24 : ఎస్‌జీఎఫ్ కామారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉమ్మడి జిల్లాల అండర్ -14,17 బాల బాలికల యోగా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ నిజామాబాద్ కార్యదర్శి నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం వద్ద ఉన్న యోగా భవన్ లో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9347216426 నంబరును సంప్రదించాలని సూచించారు.

# సొసైటీ నిధులు సొంతానికి వాడుకుంటారా?

- సిబ్బంది నిర్లక్ష్యంతో రుణమాఫీ కోల్పోయాం
- సిరికొండ విండో మహాజన సభలో రైతుల ఆగ్రహం



మహాజన సభలో పాలకవర్గ సభ్యులను నిలదీస్తున్న రైతులు

సిరికొండ, సెప్టెంబర్ 24: సొసైటీ నిధులు సొంతానికి వాడుకొని రైతులను నట్టేట ముంచుతారా అంటూ పాలకవర్గం, సిబ్బందిపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం సిరికొండ సొసైటీ కార్యాలయంలో చైర్మన్ చెల్లం గంగాధర్ అధ్యక్షతన నిర్వహించిన మహాజన సభ వాడీవేడిగా సాగింది. ఇన్‌చార్జి సీఈవో గిరిరాజ్ ఆదాయ,వ్యయాలను చదివి వినిపించగా.. సొసైటీ సిబ్బంది అనామత్ పద్దుల కింద లక్షల రూపాయలు తీసుకోవడం ఏంటని మండిపడ్డారు. పెద్దవాల్గోట్ గోదాం ప్రారంభ ఖర్చులు రూ. లక్షా 56 వేలు, ఇతర ఖర్చులకు మరో రూ. లక్షా 30 వేలు కావడంపై ప్రశ్నించారు. సొసైటీ సొమ్మును తమ వ్యక్తిగత అవసరాలకు తీసుకొని, రైతులను నట్టేట ముంచుతున్నారని ఆరోపించారు. పంట రుణాలను సిబ్బంది సకాలంలో ఆన్‌లైన్ చేయకపోవడంతో 133 మంది రైతులు నష్టపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీ సభ్యత్వం కోసం జమ చేసిన వాటా డబ్బులను సిబ్బంది కుమ్మక్కై మింగేశారని ఆరోపించారు. అవినీతికి పాల్పడుతున్న సొసైటీ సిబ్బందిని వెంటనే తొలగించాలని, సొంత ప్రయోజనాలకు సొసైటీ డబ్బులను వాడుకున్న వాటిని వెంటనే రికవరీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ షాయరీ నర్సయ్య, డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

**కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

కంఠేశ్వర్, సెప్టెంబర్ 24: నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హత కలిగిన వారు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఓటరు నమోదు కోసం ఈ నెల 30న పబ్లిక్ నోటీసు జారీ చేస్తారని తెలిపారు. గతంలో ఓటుహక్కు నమోదు చేసుకున్నవారు సైతం మరోసారి ఓటు హక్కు నమోదుచేసుకోవాలని సూచించారు. నవంబర్ 23న ముసాయిదా జాబితా ప్రకటిస్తారని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9 వ తేదీవరకు తెలుపవచ్చని పేర్కొన్నారు. డిసెంబర్ 30న ఓటరు తుది జాబితా వెలువడుతుందని తెలిపారు.

## ఓటరు సర్వే పకడ్బందీగా చేపట్టాలి

సిరికొండ, సెప్టెంబర్ 24: ఓటరు జాబితా ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆర్డీవో రాజేంద్రకుమార్ అన్నారు. మంగళవారం ఆయన తహసీల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా సర్వేను ఈనెల 26 లోగా పూర్తి చేసి, పారదర్శకంగా రూపొందించాలని సూచించారు. తహసీల్దార్ రవీందర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంఆర్ఐ గంగరాజు, ఏఆర్ఐ నాగన్న, బీఎల్వోలు పాల్గొన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కోటగిరి, సెప్టెంబర్ 24: గ్రామాల్లో తాగునీటి సరఫరా చేసే వాటర్‌మెన్లు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మిషన్ భగీరథ (ఆర్‌డబ్ల్యూఎస్) డీఈ మున్నీ అన్నారు. శిక్షణలో భాగంగా మంగళవారం ఎంపీడీవో మీటింగ్‌లో హాల్‌లో పలు శాఖల కో-ఆర్డినేటర్లు శిక్షణ ఇచ్చారు. బోరుబావులు, పైపులైన్ల మరమ్మతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నాలుగు రోజులు నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, భగీరథ ఏఈ ధన్‌రాజ్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమాలు



తడిపొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేషన్ అధికారులు

కంఠేశ్వర్, సెప్టెంబర్ 24: స్వచ్ఛతా-హీ సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని గంజ్ ప్రాంతంలో మంగళవారం శ్రమదానం నిర్వహించారు. శ్రమదానంలో అడిషనల్ కమిషనర్ శంకర్‌తోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, జవాన్లు పాల్గొన్నారు. నగరంలో 8, 24, 26డివిజన్లలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. పబ్లిక్ టాయిలెట్ల వద్ద పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్, ఆర్పీలు, ఆశ కార్యకర్తలు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

## వీఆర్‌ఏల వారసులను రెగ్యులర్ చేయాలి

కోటగిరి/ /సిరికొండ, సెప్టెంబర్ 24: రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏలుగా పని చేస్తున్న వారి వయస్సు 61 ఏండ్లు దాటితే వారి స్థానంలో తమను రెగ్యులర్ చేయాలని వారి వారసులు కోరారు. ఈ మేరకు వారు తహసీల్దార్ గంగాధర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం రెగ్యులర్ చేస్తామని జీవో జారీ చేసిందని, అనివార్య కారణాలతో జాప్యం జరిగిందని తెలిపారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. జంగం గోపి, ఆనంద్, సాయికుమార్, శ్రీధర్, గంగాధర్ ఉన్నారు.
వీఆర్‌ఏల వారసులను రెగ్యులర్ చేయాలని కోరుతూ నరేందర్, భాస్కర్ సిరికొండ మండల కేంద్రంలో తహసీల్దార్ రవీందర్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

## ఇసుక టిప్పర్, జేసీబీ పట్టివేత

పొతంగల్, సెప్టెంబర్ 24: మండలంలోని జల్లాపల్లి గ్రామ శివారులో ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య మంగళవారం తెలిపారు. జల్లాపల్లి శివారులో మెయిన్‌రోడ్డు వద్ద ఇసుక లోడ్‌తో ఉన్న టిప్పర్‌ను ఇసుక నింపిన జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మండంలోని శేషాద్రి ఫారం నుంచి సుంకిని వెళ్లే దారిలో రెండురోజుల క్రితం పది ట్రిప్పుల ఇసుక డంపును సీజ్ చేశామని, వాటికి మంగళవారం వేలం వేయగా సుంకిని గ్రామానికి చెందిన రమేశ్ రూ. 25వేలకు దక్కించుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

**రుద్రూర్‌లో..**

రుద్రూర్, సెప్టెంబర్ 24: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పొతంగల్ మంజీరా నది నుంచి ఇసుకను తరలిస్తుండగా రుద్రూర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకొని, పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. టిప్పర్‌ను తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

## రైతు ఉత్పత్తిదారుల సంఘం తృతీయ మహాజనసభ

సిరికొండ, సెప్టెంబర్ 24 : నాబార్డు సహకారంతో నాబ్‌కాన్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం రైతు చైతన్య రైతు ఉత్పత్తిదారుల కంపెనీ తృతీయ మహాజనసభ నిర్వహించారు. నాబ్‌కాన్స్ కో-ఆర్డినేటర్ థామస్ మోడీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులందరం ఏకమవుదామని, మన పంటలతో మనమే వ్యాపారం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

# పీఆర్టీయూ నూతన కార్యవర్గానికి సన్మానం

ధర్పల్లి, సెప్టెంబర్ 24 : ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన పీఆర్టీయూ కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. మంగళవారం మండల కేంద్రంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి సతీశ్‌కుమార్‌తోపాటు కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, ప్రసన్నకుమార్, జిల్లా కార్యవర్గ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన అంకం నరేశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ను పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం శశికళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మోస్రాలో..**

మోస్రా (చందూర్), సెప్టెంబర్24 : పీఆర్టీయూ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన మోస్రా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాజేశ్వర్‌ను మంగళవారం తోటి ఉపాధ్యాయులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

- **గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి :** ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 24 : రాష్ట్రంలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని సామాజిక లేఖా రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తండాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశంలో సభ్యులు రాజేందర్, వేముల శేఖర్ పాల్గొన్నారు.
- **26 వరకు ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు :** ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 24: తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షలు అక్టోబర్‌లో నిర్వహించనున్నారని, ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్ష తత్కాల్ ఫీజుతో ఈ నెల 26 వరకు అవకాశం కల్పించినట్లు కో-ఆర్డినేటర్ తుల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజును టీఎస్ ఆన్‌లైన్, ఏపీ ఆన్‌లైన్ మీ సేవ సెంటర్లో చెల్లించవచ్చని, ఏమైనా సందేహాలుంటే 8008403518 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.
- **అంగన్‌వాడీ కేంద్రానికి ప్లేట్ల వితరణ:** కోటగిరి, సెప్టెంబర్ 24: మండలంలోని లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల కోసం అదే గ్రామానికి చెందిన హిప్పర్గా లింగప్ప జ్ఞాపకార్థం అతడి సతీమణి హిప్పర్గా గంగామణి 15 స్టీల్ ప్లేట్లు, 15 స్పూన్లను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గోదావరి, గ్రామస్తులు పాల్గొన్నారు.
- **నేడు కోటగిరిలో బీఎల్వోలతో సమావేశం:** కోటగిరి, సెప్టెంబర్ 24: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో బుధవారం బీఎల్వోలతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు సమావేశం ఉంటుందని బీఎల్వోలు సకాలంలో హాజరు కావాలని సూచించారు.
- **పేకాట స్థావరంపై దాడి:** పొతంగల్, సెప్టెంబర్24: మండలంలోని టాక్లీ గ్రామ శివారులో ఓ పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,740 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.
- **కొనసాగుతున్న మండల స్థాయి క్రీడలు:** జక్రాన్‌పల్లి, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడలు రెండోరోజైన మంగళవారం కొనసాగాయి. మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని, నేడు క్రీడా పోటీలు ముగియనున్నట్లు క్రీడల కన్వీనర్ లింగన్న తెలిపారు.
- **రుద్రూర్ ఎంపీవోగా లక్ష్మణ్‌రెడ్డి:** రుద్రూర్, సెప్టెంబర్ 24: రుద్రూర్ ఎంపీవోగా లక్ష్మణ్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డీఆర్డీఏ కార్యాలయంలో అకౌంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన లక్ష్మణ్‌రెడ్డి రుద్రూర్ ఎంపీవోగా వచ్చినట్లు ఎంపీడీవో సురేశ్‌బాబు మంగళవారం తెలిపారు. ఎంపీవోను సిబ్బంది, స్థానిక నాయకులు కలిసి సన్మానించారు.
- **తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం:** రుద్రూర్, సెప్టెంబర్24: మండలంలోని అంబంలో తాగునీటి సరఫరాలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. నీటి ట్యాంకును శుభ్రం చేయించడంలేదని, నాచు పేరుకుపోతున్నా పట్టించుకోవడంలేదన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.
- **ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు :** డిచ్‌పల్లి, సెప్టెంబర్ 24 : టీయూలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ -1, 4 సంయుక్తంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారిణి రసూల్ బీ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.ఆరతి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కె.రవీందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ స్వప్న, స్రవంతి, వలంటీర్లు పాల్గొన్నారు.
- **ఎంబీఏ కోర్సులో స్పెషలైజేషన్ ఎంపికపై సెమినార్:** డిచ్‌పల్లి, సెప్టెంబర్ 24 : టీయూలో ఎంబీఏ కోర్సులో స్పెషలైజేషన్ ఎంపికపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్ ఎం.యాదగిరి హాజరై మాట్లాడారు. బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో స్పెషలైజేషన్ల ప్రాముఖ్యతను వివరించారు. మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. వివిధ స్పెషలైజేషన్లలో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. అనంతరం సెమినార్ డైరెక్టర్ సీహెచ్ ఆంజనేయులు స్పెషలైజేషన్ ఎంపికలో పద్ధతులను వివరించారు. ప్రిన్సిపాల్ ఆరతి, జిల్లాలోని ఎంబీఏ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.
- **ఎమ్మెల్యేకు సన్మానం:** చందూర్, సెప్టెంబర్ 24 : వర్ని ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన సురేశ్‌బాబా, డైరెక్టర్లు వేములపల్లి సుధాకర్‌రావు, షేక్ హైమద్ మంగళవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సన్మానించారు.

## విద్యార్థుల మధ్య ఘర్షణ

శక్కర్‌నగర్, సెప్టెంబర్ 24: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇద్దరు విద్యార్థుల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడిచేసుకోగా విషయం గుర్తించిన కళాశాల సిబ్బంది ఆ విద్యార్థులను సముదాయించి ఇంటికి పంపారు. దెబ్బలు తిన్న విద్యార్థి తల్లి మంగళవారం కళాశాలకు వచ్చి తన కుమారుడిపై దాడి చేసిన విద్యార్థిని తరగతి గదిలో నుంచి ఈడ్చుకువచ్చి బాదినట్లు సమాచారం. ప్రిన్సిపాల్, సిబ్బందిని వివరణ కోరగా, విషయం వాస్తవమే అయినా, ఇద్దరు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించామని వివరించారు. ఫిర్యాదు అందలేదని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

# ఘనంగా ఎన్ఎస్ఎస్ డే



బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

శక్కర్‌నగర్/మోర్తాడ్/భీమ్‌గల్/ నందిపేట్, సెప్టెంబర్ 24: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. జాతీయ సేవా పథకం దినోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. జాతీయ సేవా పథకంలో భాగంగా విద్యార్థులు పాఠశాల ఆవరణలోని పిచ్చిమొక్కలు తొలగించి, ప్లాస్టిక్ వ్యర్థాలను పరిశుభ్రం చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్ కుమార్ కళాశాల ఆవరణలోని కోనోకార్పస్ మొక్కలను తొలగించి, ఇతర మొక్కలను నాటేందుకు అనుమతించాలని సబ్ కలెక్టర్‌కు నివేదించారు. ఈ విషయంలో ఆయన సానుకూలంగా స్పందించారు. కళాశాల ఆవరణలో క్రీడా మైదానం ఏర్పాటు చేసుకోవాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో ప్రిన్సిపాల్‌కు సూచించారు. కార్యక్రమంలో బోధన్ తహసీల్దార్ విఠల్, ప్రిన్సిపాల్ సురేశ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పీవీ సత్యవర ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బి. ప్రసాద్, జి. గోపితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు. మోర్తాడ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పెద్దన్న, వైస్ ప్రిన్సిపాల్ భూపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. భీమ్‌గల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ హెచ్. సతీశ్, వైస్‌ప్రిన్సిపాల్ సుమలత, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ పి.సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. నందిపేట్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ సేవా పథక ఆవిర్భావ దినోత్సవం, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం సూచించారు. ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ లక్ష్మణ్‌శాస్త్రి, సిబ్బంది, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మరమ్మతులు మరిచారు..

- 20 రోజుల క్రితం కోతకు గురైన రోడ్లు
- స్పందించని అధికారులు
- ప్రజలకు తప్పని కష్టాలు



వేల్పూర్ - రామన్నపేట్ మార్గంలో కోతకు గురైన రోడ్డు

వేల్పూర్, సెప్టెంబర్ 24: 20 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో ధ్వంసమైన రోడ్ల మరమ్మలను అధికారులు మరిచారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంక్సాపూర్ నుంచి పోచంపల్లి వెళ్లే దారి, వేల్పూర్ నుంచి రామన్నపేట్ వెళ్లే రోడ్డు వర్షం నీటి ప్రవాహంతో కోతకు గురయ్యాయి. దీంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షపునీరు తగ్గినా సంబంధింత అధికారులు మాత్రం మరమ్మతులు చేయించటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు గ్రామాలకు ప్రధాన రహదారులు కోతకు గురి కావడంతో ఆయా గ్రామాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై సంబంధించిన అధికారులు స్పందించి తాత్కాలికంగా రోడ్లను మరమ్మతు చేయించి రాకపోకలను ప్రారంభించటానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పోచంపల్లి, రామన్నపేట గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## సంక్షిప్తంగా..

- **విద్యార్థులకు వైద్య పరీక్షలు -** బోధన్ రూరల్, సెప్టెంబర్ 24: సాలూరా మండలంలోని తగ్గెల్లి గ్రామంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలలో 55 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐదుగురు విద్యార్థులను వైద్య పరీక్షల నిమిత్తం బోధన్ ఏరియా దవాఖానకు తరలించారు. కార్య క్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్, శ్వేత, హెచ్‌ఎం ధన్‌రాజ్, ఉన్నారు.
- **హెచ్‌ఎంల సమావేశం-** భీమ్‌గల్, సెప్టెంబర్ 24: ప్రతి హెడ్మాస్టర్ ప్రశస్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దివ్యాంగ పిల్లల వివరాలను నమోదు చేయాని మండల విద్యాశాఖ అధికారి స్వామి అన్నారు. హెచ్‌ఎంలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.
- **ముఖ్తార్ పాషా, పైల చంద్రక వర్ధంతి సభ** బోధన్, సెప్టెంబర్ 24: పట్టణంలోని భారత కార్మిక సంఘాల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ముఖ్తార్ పాషా, పైల చంద్రక్క వర్ధంతి సభను సంఘం నాయకులు నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య, నాయకులు సురేశ్, శ్రావణ్, రాజశేఖర్, లక్ష్మణ్ గౌడ్, రాజేందర్ గౌడ్ పాల్గొన్నారు.
- **ముఖ్తార్ పాషాకు నివాళి-** మాక్లూర్, సెప్టెంబర్ 24: అఖిల భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ముఖ్తార్ పాషా 4వ వర్ధంతిని మంగళవారం ఒడ్యాట్‌పల్లిలో నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఆసంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుడ్డు గంగాధర్, శివకుమార్, అబ్బయ్య, నవీన్, దుర్గ పాల్గొన్నారు.
- **ఎడపల్లిలో ఉర్సు ప్రారంభం-** ఎడపల్లి, సెప్టెంబర్ 24: మండల కేంద్రంలోని ఓల్డ్ విలేజ్‌లో ఉన్న హజరత్ అబ్దుల్ షా ఉర్సు మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు గందాలను దర్గాకు సమర్పించారు. రెండో రోజు కవాలితో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.
- **ఉచిత నవోదయ కోచింగ్‌కు దరఖాస్తు తేదీ పొడిగింపు-** కోటగిరి, సెప్టెంబర్ 23: మండల కేంద్రంలో నవోదయ ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కోచింగ్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ పి.గోపికృష్ణ, కోటగిరి మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, రుద్రూర్ మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్ర శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈనెల 25న శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు.
- **ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం-** వినాయక్‌నగర్,సెప్టెంబర్ 24: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి విమర్శించారు. మంగళవారం ఆయన జిల్లాకేంద్రంలో పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా ఆస్తి నష్టం జరిగిందని, పరిహారంపై జిల్లా యంత్రాంగం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హులైన రైతులకు రుణ మాఫీ అందజేసి, పంటలు నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
- **విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు-** మోర్తాడ్, సెప్టెంబర్ 24: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంపీడీవో రాజశ్రీనివాస్ బహుమతులు అందజేశారు.
- **కిసాన్‌నగర్‌లో దంత వైద్యశిబిరం -** బాల్కొండ, సెప్టెంబర్ 24: కిసాన్‌నగర్‌లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దంత వైద్యశిబిరం నిర్వహించినట్లు వైద్యుడు నిహార్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు జ్ఞానసాగర్‌రెడ్డి, హెచ్‌ఎం రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.
- **విద్యార్థులకు అభినందన -** భీమ్‌గల్, సెప్టెంబర్ 24: ఈనెల 30 నుంచి అక్టోబర్ 4 వరకు జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్రం నుంచి బడాభీమ్‌గల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ.ప్రవస్తి, ఎన్.ఆనందిత ఎంపికయ్యారని పీడీ భూపతి మంగళవారం తెలిపారు. వీరిని హెచ్‌ఎం కృష్ణస్వామి, వీడీసీ సభ్యులు సన్మానించారు.
- **జ్యోతిబాపూలేకు నివాళి-** మోర్తాడ్, సెప్టెంబర్ 24: జ్యోతిబాపూలే సత్యశోధక్ స్థాపించి 151 ఏండ్లు పూర్తయిన సందర్భంగా మోర్తాడ్‌లో దళిత సంక్షేమసంఘం నాయకులు మంగళవారం జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లారి రాజారాం, జాంభవ, గంగాధర్, రవి, సంజయ్, రాజు, ప్రణయ్ పాల్గొన్నారు.
- **జాతీయస్థాయి పోటీలకు ఎంపిక-** మోర్తాడ్, సెప్టెంబర్ 24: జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని రితిక ఎంపికైనట్లు పీఈటీ సింధుజ తెలిపారు. ఈనెల 26 నుంచి 30 వరకు హర్యానాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.
- **ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం-** మోర్తాడ్, సెప్టెంబర్ 24: కమ్మర్‌పల్లిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల ఉత్తమ ఉపాధ్యాయులను భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎంపీడీవో రాజ శ్రీనివాస్, భాస్కర ఫార్మసీ వ్యవస్థాపకులు భాస్కర్‌యాదవ్, మండలనోడల్ అధికారి గంగాధర్, ఎంఈవో ఆంధ్రయ్య, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.
- **రోగులకు సరైన చికిత్సలు అందించాలి** శక్కర్‌నగర్, సెప్టెంబర్ 24: బోధన్ పట్టణంలోని వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వచ్చేవారికి సకాలంలో, సరైన వైద్య చికిత్సలు అందించాలని దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ సూచించారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ దవాఖానలోని అన్ని విభాగాలను ఆయన పరిశీలించి, వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.
- **చెక్కుల అందజేత-** ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్24: పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కలిగోట గంగాధర్, యామాద్రి భాస్కర్ పాల్గొన్నారు.
- **మక్కకు రూ.500 బోనస్ ఇవ్వాలి-** ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్24: కాంగ్రెస్ ప్రభుత్వం మక్కజొన్న పంటకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని దోబీఘాట్ ఆవరణలో రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్నను పరిశీలించారు.
- **మున్సిపల్ కార్యాలయంలో వైద్య శిబిరం-** ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్24: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. కమిషనర్ రాజు, చైర్‌పర్సన్ లావణ్య హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, మున్సిపల్ కార్మికులతో పాటు స్థానికులు వైద్య పరీక్షలను చేయించుకున్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి తనిఖీ చేశారు. మున్సిపల్ కార్మికులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని పరిశీలించారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
- **రక్తదాన శిబిరం-** ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్24: పట్టణంలోని మామిడిపల్లి శివారులో ఉన్న ఓ సంఘ భవనంలో మంగళవారం నిర్వహించిన ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహానాయుడు జన్మదిన వేడుకల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు. మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.
- **చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు -** ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్24:మండలంలోని సుర్బిర్యాల్ మాజీ సర్పంచ్ అవినీతికి పాల్పడ్డాడని పేర్కొంటూ గ్రామస్తులు మంగళవారం పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి పోలీస్ స్టేషన్‌కు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడిషనల్ డీసీపీ వెంట ఎస్‌హెచ్‌వో రవి కుమార్, సిబ్బంది ఉన్నారు.
- **ఉద్యోగ నియామకాలు చేపట్టాలి-** నవీపేట, సెప్టెంబర్ 24: 61 ఏండ్లు పైబడిన వీఆర్‌ఏల వారసులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ వెంకటరమణకు పలువురు వీఆర్‌ఏల వారసులు వినతిపత్రం అందజేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలను కల్పించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు.
- **ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష-** శక్కర్‌నగర్, సెప్టెంబర్ 24: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్షతోపాటు రూ. 500 జరిమానా విధిస్తూ మంగళవారం బోధన్ సెకండ్‌క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ శేషతల్ప శాయి తీర్పు చెప్పారు. రెండు రోజులు క్రితం మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తులను మంగళవారం న్యాయస్థానంలో అప్పగించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.
- **బీఎల్‌వోలకు అవగాహన -** ఎడపల్లి, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ దాన్వాల్ మంగళవారం బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాపై ఇంటింటి సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

## పౌష్టికాహారం తీసుకోవాలి

బోధన్ రూరల్/రెంజల్/ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 24: గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం సుశీల, సమత, అంగన్‌వాడీ టీచర్లు అరుందతి, శ్యామల, శరీష తదితరులు పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని వీరన్నగుట్ట, వీరన్నగుట్ట తండాలో పోషణ మాసోత్సవంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.ఆర్మూర్ పట్టణంలోని రాజారాంనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఆర్మూర్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ రమణమ్మ గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమణమ్మ

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★అనఘా షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్ (M/F) Sal:15000/- అనుభవం గల ఎలక్ట్రిషియన్ (డిప్లొమ ఎలక్ట్రిషియన్) Sal:15000/- month మరియు సెక్యూరిటీ గార్డ్స్ (M/F) Sal:12000/- month కావలెను. ఆసక్తి గలవారు వెంటనే I.D. ప్రూఫ్, ఫోటోతో సంప్రదించండి. అనఘా షాపింగ్ మాల్, R.P రోడ్, నిజామాబాద్
NTZ-334461

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.